క్లుప్తంగా

సబ్‌స్టేషన్ మరమ్మతు పనులు పూర్తి

తాడూరు: మండలంలోని ఐతోలు సబ్‌స్టేషన్‌లో చేపట్టిన మరమ్మతు పనులు పూర్తి అయ్యాయని ఏఈ శ్రీరాములు తెలిపారు. పనులు ముగిసిన తర్వాత ఐతోలుతోపాటు బలాన్‌పల్లి, అంతారం, శిర్సవాడ, గోవిందాయపల్లి, ఎట్టిదార్‌పల్లి, లచ్చిరాంతండా గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు.

మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

కొల్లాపూర్: మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీఆర్‌ఎస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్‌మాదిగ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షలకు పైగా మాదిగ జనాభా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వే తప్పుల తడకగా ఉందన్నారు. మాదిగల జనాభాను తక్కువగా చేసి చూపారన్నారు. మాదిగలకు కేవలం 9 శాతం రిజర్వేషన్లు కల్పించడం దారుణమన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు.

యువతకు అవకాశం ఇవ్వాలి

మన్ననూర్: రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభకు కొత్త అధ్యక్షుడిగా యువకులకు అవకాశం ఇవ్వాలని మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సంబు వెంకటరమణ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర మహాసభకు 13 ఏళ్లుగా అధ్యక్ష పదవిని అమరాబాది లక్ష్మీనారాయణ ఉన్నారని దీంతో ఆయన పనితీరుపై రాష్ట్ర వ్యాప్తంగా ఆర్యవైశ్యులు అసహనంతో ఉన్నారని వివరించారు. సంఘం నిబంధనల ప్రకారం రెండేళ్లు మాత్రమే పదవిలో ఉండాలని కాని 13 ఏళ్లుగా కొనసాగడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. స్వచ్ఛందంగా పదవి నుంచి తప్పుకోవాలని కోరారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ



లింగాల: మండలంలోని వల్లభాపూర్, మానాజీపేట, రాంపూర్ పాఠశాలలను గురువారం మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా పాఠశాలలకు సంబంధించిన పలు రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు.

ఆలయ నిర్మాణానికి సహకారం



కల్వకుర్తి రూరల్: మండలంలోని ఎలికట్టలో నిర్మించే చిన్న కేశవస్వామి దేవాలయానికి చేయూత అందిస్తానని ఇచ్చిన హామీ మేరకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ గురువారం 100 బస్తాల సిమెంటును అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు సిమెంటును దేవాలయం వద్దకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఉప్పల వెంకటేష్‌కు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భీమయ్య, కేశవులు, రవి, స్వామి, రమేష్, శ్రీకాంత్, బాలయ్య, మల్లయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ కోచ్‌గా రాము



కల్వకుర్తిరూరల్: తెలంగాణ 38వ జాతీయ క్రీడలకు రాష్ట్ర నెట్‌బాల్ టీంకోచ్‌గా మండలంలోని తాండ్ర గ్రామానికి చెందిన జి రాము ఎంపికయ్యారు. డెహ్రాడూన్‌లో ఈ నెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు 38వ జాతీయ క్రీడలకు కోచ్‌గా వ్యవహరిస్తారని నెట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విక్రమ్‌ఆదిత్యరెడ్డి గురువారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఊర్కొండ: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం మహబూబ్ నగర్ జిల్లా అమిస్తాపూర్ కు చెందిన ఉరడి సుధాకర్ భార్య స్వగ్రామమైన కల్వకుర్తి మండలం రాచూరులో నివాసం ఉంటున్నాడు. గురువారం తెల్లవారుజామున అమిస్తాపూర్‌లో పనులు ముగించుకొని సాయంత్రం రాచూర్ వస్తున్న క్రమంలో ఊర్కొండ మండల కేంద్రంలోని కల్వకుర్తి జడ్చర్ల ప్రధాన రహదారిపై పెట్రోల్ పంపు వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పంటల సాగుపై డిజిటల్ సర్వే



వెల్దండ మండలం పెద్దాపూర్‌లో..



చారకొండ మండలం సిర్సనగండ్లలో డిజిటల్ సర్వే చేస్తున్న అధికారులు

తాడూరు: మండల కేంద్రంతో పాటు పొల్మూరు, గుట్టలపల్లి గ్రామాల్లో గురువారం వ్యవసాయ ఆధ్వర్యంలో పంటలసాగుపై డిజిటల్ సర్వే చేపట్టారు. రైతులు సాగు చేసిన పంటలను ఆన్‌లైన్ నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆన్‌లైన్ నమోదుతో పంటలకు పసల్‌బీమా వర్తిస్తుందన్నారు. సాగుకు యోగ్యంకాని భూములు, పంటలు సాగు చేస్తున్న భూములను గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రైతులు డిజిటల్ సర్వేకోసం వచ్చే ఏఈఓలకు సహకరించాలన్నారు. ఏఈఓ చంద్రకాంత్ సర్వేలో పాల్గొన్నారు.

చారకొండ: మండలంలోని సిర్సనగండ్లలో గురువారం పంటల సాగుపై వ్యవసాయ శాఖ అధికారులు డిజిటల్ క్రాప్ సర్వేను చేపట్టారు. మండల వ్యవసాయ అధికారి తనూజరాజు సర్వేను పరిశీలించి, సాగు పంటలను పరిశీలించారు. మండలంలోని క్లస్టర్ వారిగా సర్వే నంబర్లను సంబంధిత డిజిటల్ సర్వేలో పూర్తి వివరాలను నమోదు చేయాలని ఏఓ సూచించారు. సిర్సనగండ్ల శివారులో రైతులు సాగుచేసిన వరి పైరును పరిశీలించి వాటి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వారి వెంట ఏఈఓ, రైతులు తదితరులు ఉన్నారు.

వెల్దండ: రైతులు సాగుచేసిన పంటలను ఆన్‌లైన్ నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు. గురువారం మండలంలోని పెద్దాపూర్‌లో అధికారులు వరిపంటలు, మొక్కజొన్న, ఆముదం పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓలు గణేష్, సురేష్‌గౌడు, బిన్నతి, విజయలక్ష్మి, తదితరులు ఉన్నారు.

దళితుల భూముల జోలికి రావొద్దు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్

తాడూరు: మండల కేంద్రంలో నంద్యాల హైవే కోసం బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం బలవంతంగా దళితుల భూములు లాక్కోవడం సరికాదని మరోసారి దళితుల భూముల జోలికి వస్తే ఖబడ్దార్ అంటూ మాల మహానాడు పిల్లి సుధాకర్ హెచ్చరించారు. గురువారం ఇటీవల అక్రమ భూసర్వేను అడ్డుకోవడానికి మనస్తాపం చెంది ఆత్మహత్య యత్నానికి పాల్పడిన కురుమూర్తి, శేఖర్‌లను పరామర్శించి ఆయా భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో బైపాస్ నిర్మాణం కోసం భూసర్వేను పోలీస్ బందోబస్తు మధ్య మూడు సార్లు సర్వే చేపట్టి ఆ సర్వే అగ్రవర్ణాల భూముల మీదుగా పోతుందని భావించి తిరిగి నాలుగోసారి సర్వే నిర్వహించడం సరికాదన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో 10 ఏళ్లు దళితుల భూముల జోలికి వస్తే తగిన గుణపాఠం చెప్పి గద్దె దించే వరకు పోరాటం చేశామన్నారు. భూ సర్వేను నిలిపివేసి మొదటి మూడుసార్లు చేసిన సర్వే ప్రకారమే భూ సేకరణ చేయాలన్నారు. దళితుల భూముల జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి నరేష్, రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటస్వామి, మాల మహానాడు నాయకులు చింత సత్తి, కురుమూర్తి, భాస్కర్, కురుమయ్య, శేఖర్, నిరంజన్‌లు పాల్గొన్నారు.

విద్యార్థుల ఎంపిక



పెద్దకొత్తపల్లి: కల్వకోల్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు గణేష్, విజయ్‌కుమార్‌లు జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం హరిత తెలిపారు. ఇటీవల నిర్వహించిన 2024–25 సంవత్సరంలో జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్టులో ప్రతిభ కనబర్చి ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేస్తున్న మాలమహానాడు నాయకులు

ఉప్పునుంతల: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల మహానాడు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి మండల అధ్యక్షుడు అలూరి వెంకటేష్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణపై తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాలలకు అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు ఆలూరి శ్రీనివాసులు, పాత్కుల కురమయ్య, ప్రహ్లాదు, లింగమయ్య, విష్ణు శేఖర్, బాలకృష్ణ, స్వామి, శ్రీను, బాలరాజు, అంజి తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో శుక్రవారం వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ జిల్లెల్ల వెంకటరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ దాడులలో పట్టుబడ్డ, స్వాధీనం చేసుకున్న టూ వీలర్, త్రీ వీలర్, ఫోర్ వీలర్ వాహనాలను వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు కార్యాలయంలో డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

దొంగతనాలను అరికట్టాలని వినతి



పెంట్లవెల్లి: మండలంలోని పలు గ్రామాల్లో గతంలో, ప్రస్తుతం జరుగుతున్న వరుస దొంగతనాలపై విచారణ వేగవంతం చేసి నిందితులను శిక్షించాలని బీజేపీ ఆధ్వర్యంలో గురువారం పెంట్లవెల్లి ఎస్‌ఐ రామన్‌గౌడ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్ర మాట్లాడుతూ కొన్ని రోజులుగా మండలంలో మంచాలకట్ట, పెంట్లవెల్లి, గోపులాపురం తదితర గ్రామాల్లో వరుసగా దొంగతనాలు అవుతున్నాయని వివరించారు. చిన్నచిన్న ఆలయాలలో హుండీలు, ఆభరణాలు, డబ్బులు చోరీకి గురవుతున్నాయని పేర్కొన్నారు. పోచమ్మ, సవారమ్మ, జమ్ములమ్మ, సుంకులమ్మ, అంజనేయస్వామి దేవాలయాలలో దొంగతనాలకు పాల్పడ్డారని తెలిపారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రతాప్, మూలె వెంకటేష్, అశోక్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీకి వినతి



అచ్చంపేట రూరల్: రెడ్డి సామాజికవర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని డీఎస్పీ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్డి సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. గోవర్ధన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, వెంకట్‌నారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ




నాగర్‌కర్నూల్ రూరల్: తెలంగాణ రజక వృత్తిదారుల సమైక్య 2025 క్యాలెండర్‌ను గురువారం జిల్లా కేంద్రంలో సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రజక వృత్తిదారుల సమైక్య జిల్లా కన్వీనర్ కొత్త శేఖర్ మాట్లాడుతూ నిర్మాణపరంగా రజకులు క్షేత్రస్థాయి నుంచి బలోపేతం కావాలని, రజకులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతర పోరాటాలు రూపొందించుకోవాలని పిలుపునిచ్చారు. రజక వృత్తి దారులకు ప్రభుత్వం రూ. 4 వేలు పింఛన్ తో పాటు 250 నుంచి 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రజక వృత్తిదారుల సమైక్య నాయకులు బాలయ్య, నరేష్, భాస్కర్, తారక్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై ప్రభుత్వం కుట్ర


నాగర్‌కర్నూల్ రూరల్: తెలంగాణలోని బీసీల జనాభా సంఖ్యను తక్కువ చూపించి రాజకీయ హక్కులు, విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపై దెబ్బ తీయడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ ఆరోపించారు. గురువారం ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన కుల గణన సర్వే తప్పుల తడకగా మారిందన్నారు. తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన



అమ్రాబాద్: మండలంలోని లక్ష్మాపూర్(బీకే)తండా అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఆదివాసి, గిరిజన చిన్నారులు మండ్లి అంజమ్మ కుమారుడు రాజు, అజయ్‌లకు అన్న ప్రసాన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ సిక్కుడు సువర్ణ పాల్గొని అంగన్‌వాడీ కేంద్రం ద్వారా చిన్నారులకు బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారం, వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ టీచర్ వల్లమ్మ, పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు



తాడూరు: మండలంలోని ఐతోలులో గురువారం షీ టీం ఆధ్వర్యంలో సఖి, పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా షీ టీం ఇన్‌చార్జ్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా మహిళలను, బాలికలను వేధిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఫిర్యాదులు ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో షీ టీం సభ్యులు శ్రీలత, సఖి సెంటరు అడ్మిన్ సునీత, హెచ్‌ఎం భాస్కర్ రెడ్డి, షీ టీం సభ్యులు వెంకటయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేస్తాం

తెలకపల్లి: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న సీనియర్ మేట్లకు సెమీ స్కిల్డ్ మస్టర్లు ఇవ్వాలని ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నందిపేట భాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో సీనియర్ మేట్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న సీనియర్‌మేట్లకు ఇప్పటివరకు వేతనం ఇవ్వలేదన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని, కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాసులుకు వినతిపత్రాన్ని అందజేశారు. సీనియర్ మేట్ల సంఘం మండల అధ్యక్షుడు చిన్నరాయుడు, పరశురాములు, అర్చన, బాలస్వామి, దశరథం తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌ను మంత్రివర్గం నుంచి తొలగించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అచ్చంపేట రూరల్: ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను మంత్రివర్గం నుంచి తొలగించాలని గద్దర్ విగ్రహ నిర్మాణ కమిటీ అచ్చంపేట అధ్యక్షుడు జక్క గోపాల్, యాదన్న డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని అమర వీరుల స్థూపం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ కోసం, పీడిత, పేద ప్రజల కోసం, అణగారిన వర్గాలు, మహిళల కోసం గద్దర్ పోరాడారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రజా ఉద్యమ నాయకులు మల్లికార్జున్, శ్రీశైలం, అనీల్, బాలస్వామి, ఎంఎం గౌడ్, పాండు, లక్ష్మీనారాయణ, రాజగోపాల్, సుధాకర్, ఆనంద్, ప్రసాద్ పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తిరూరల్: హామీల అమలులో కాంగ్రెస్ విఫలం అయ్యిందని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 420 ప్రభుత్వంగా మారిందన్నారు. అధికారంలోకి వచ్చి 420 రోజులు అవుతున్న వారిచ్చిన 420 హామీలు ఇప్పటికీ అమలు చేయలేదని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. రుణమాఫీ, రైతుభరోసాపై మాట మార్చడం సిగ్గుచేటన్నారు. కుల గణనలో బీసీలకు ప్రభుత్వం మోసం చేసిందన్నారు. బీసీల జనాభా 6 శాతం తగ్గడంలో కుట్ర కోణం దాగి ఉందని ఆరోపించారు. బీసీలకు న్యాయం జరిగేవరకు పోరాతామన్నారు.

13న రైతు దీక్ష

ఆరు గ్యారంటీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్‌తో ఈ నెల 13న నియోజకవర్గంలోని ఆమన్‌గల్‌లో పెద్ద ఎత్తున రైతు దీక్ష నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తెలిపారు. అనంతరం మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తున్నామన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి చేయాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు విజయ్‌గౌడ్, విజితారెడ్డి, కొండూరు గోవర్ధన్, అర్జున్‌రావు, లాలయ్యగౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఆంగ్లంలో పట్టు సాధించాలి



బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ

తెలకపల్లి: విద్యార్థులు ఆంగ్లంలో పట్టు సాధించాలని ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గౌరెడ్డిపల్లి పాఠశాలలో మండల స్థాయి స్పెల్‌బీ ఆంగ్ల పదజాలాల పరీక్ష నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో 4, 5వ తరగతి చదవుతున్న విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు మండల స్థాయి ఆంగ్ల పదజాల పరీక్ష నిర్వహించామని ఎంఈఓ తెలిపారు. ఈ పరీక్షల్లో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 60 మంది విద్యార్థులు పరీక్షల్లో పాల్గొన్నారు. గౌరెడ్డి పాఠశాలకు చెందిన నాల్గవ తరగతి విద్యార్థిని శ్వేత ఒక గంటలో 308 ఆంగ్ల పదాలు వాటికి అర్థాలు రాసి ప్రథమ స్థానంలో నిలిచింది. తాళ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన అక్షిత ద్వితీయ స్థానంలో, కారువంగ ప్రాథమిక పాఠశాలకు చెందిన రోజ తృతీయ స్థానంలో నిలిచింది. 5వ తరగతి నుంచి గౌరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన అనుణ్య గంట వ్యవధిలో 424 ఆంగ్ల పదాలు వాటికి అర్థాలు రాసి ప్రథమ స్థానంలో నిలిచింది. తాళ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాల చెందిన నవ్య ద్వితీయ స్థానం, గట్టు రాయపాకుల ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన కవిత తృతీయ స్థానంలో నిలిచింది. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్, విశ్వేశ్వర్ రెడ్డి, రాజశేఖర్ రావు, మల్లేష్, సునిల్, జహంగీర్ పాషా, శ్రీనివాసులు, కావ్య, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఆధ్వర్యంలో బోరు డ్రిల్లింగ్



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఏడుమంది రైతులు బోర్లు మంజూరుకాగా వారి పొలాల్లో గురువారం బోరు డ్రిల్లింగ్ చేసినట్లు భూగర్భ జలవనరుల శాఖ అధికారి లింగస్వామి తెలిపారు. మండల కేంద్రంలో ఏడుమంది రైతులకు బోర్లు డ్రిల్లింగ్ చేశామన్నారు. కార్పొరేషన్ ద్వారా విద్యుత్ మోటర్లను, లైన్లను ఏర్పాటు చేశామన్నారు. రైతులు వెంకటస్వామి, తిరుపతయ్య, రామకృష్ణ, శివశంకర్, మల్లయ్య పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న పెట్రోల్ బంక్ సిబ్బంది



నాగర్‌కర్నూల్ క్రైం: పెట్రోలు పోయించుకుని ఫోన్‌పే ద్వారా ఎక్కువ డబ్బులు చెల్లించడంతో గుర్తించిన పెట్రోల్ బంక్ సిబ్బంది వినియోగదారుడికి తిరిగి డబ్బులు చెల్లించి నిజాయితీని చాటుకున్నారు. మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన శ్రీను జేసీబీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ స్టేట్ పోలిస్ వెల్‌ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌లో బుధవారం జేసీబీలో రూ.9400 డీజిల్ పోయించుకొని ఫోన్ పే ద్వారా రూ. 93,400 నగదు చెల్లించి వెళ్లిపోయాడు. పెట్రోల్ బంక్ సిబ్బంది గమనించి నగదు ఎక్కువగా చెల్లించినట్లు గుర్తించారు. దీంతో వినియోగదాడుడి వివరాలు తెలుసుకొని సమాచారం ఇచ్చారు. దీంతో బాధితుడు పెట్రోల్‌బంక్‌కు రాగా తిరిగి రూ. 84 వేల నగదును ఏఆర్‌ఎస్‌ఐ గౌస్‌పాష ఆధ్వర్యంలో అందజేశారు.

కులగణన అంకెల గారడీ



మన్ననూర్: ప్రభుత్వం షెడ్యూల్డ్ కుల గణనలో అంకెల గారడీ చేసి మాలలను మోసం చేస్తుందని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి మద్దెల దివాకర్ విమర్శించారు. గురువారం మాల మహానాడు నాయకులతో కలిసి మన్ననూర్‌లోని అంబేడ్కర్ కూడలిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన గైడ్‌లైన్స్ రాజ్యాంగానికి పూర్తిగా వ్యతిరేకమన్నారు. మందకృష్ణ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు తలొగ్గి అసెంబ్లీలో వర్గీకరణకు ఆమోదం తెలపడాన్ని ఖండిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో మాలల సత్తా ఏంటో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చూపిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సామసాయిలు, భద్రీ, బాలస్వామి, పులెందర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ కేసు నమోదు

చారకొండ: ఓ యాప్ ఇన్వెస్ట్‌మెంట్ చేసి మోసపోయిన ఘటనపై గురువారం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శంషుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన ఎండీ ఖాదర్ నుంచి అదే గ్రామానికి చెందిన ఎండీ రియాజ్ డెకాత్‌లాన్ అనే ఓ యాప్‌లో గత నెల 11న రూ.69 వేలు పెట్టుబడి పెట్టాడు. సంబంధిత యాప్ క్యూఆర్ కోడ్‌కు చెల్లించడంతో రోజువారిగా రూ.4000 వేల చొప్పున ఆదాయం వస్తుందని నమ్మాడు. గత నెల 14న ట్యాక్సీ కార్డు పేరుతో మళ్లీ రూ.9500 క్యూఆర్‌కు చెల్లించడంతో మరుసటి రోజు నుంచి యాప్ క్లోజ్ అయింది. అప్పటి నుంచి యాప్ ఓపెన్ కాకపోవడంతో 1930 ఫోన్ చేసి వివరాలు తెలిపారు. గురువారం బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శంషుద్దీన్ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



గోకారంలో ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

చారకొండ: మండలంలోని గోకారం గ్రామానికి చెందిన ఏలేటి జగన్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు స్థానిక నాయకులు మాజీ సర్పంచ్ భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొండల్ ద్వారా మృతుడి కుటుంబానికి రూ.10 వేలు విలువ చేసే వంట సామాగ్రిని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శివపాల్ రెడ్డి, రామర్జున్, భగవంతు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

కొల్లాపూర్: పట్టణంలోని 16వ వార్డుకు చెందిన అరటిపండ్ల నిరంజన్ గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి మాజీ కౌన్సిలర్ రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. ఆయన వెంట నాయకులు సుధాకర్‌సింగ్, పురేందర్, ప్రభాకర్, శేఖర్‌లు ఉన్నారు.